# సాక్షి ఖమ్మం

ఆదివారం । 17 । మార్చి । 2024






**రిజర్వాయర్ ఆధునికీకరణ**

వైరా రిజర్వాయర్ కాల్వల ఆధునికీకరణకు రూ.42.10కోట్లు మంజూరు కావడంతో త్వరలోనే పనులు మొదలుకానున్నాయి. 8లో



**పోరాటాలతోనే హక్కుల సాధన**

పోరాటాలతోనే హక్కులు, సంక్షేమ పథకాల సాధన సాధ్యమవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 22°

**వాతావరణం**

జిల్లాలో ఆదివారం ఉదయం వాతావరణం కాస్త చల్లగా ఉండే అవకాశముంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

ఇఫ్తార్
(ఆదివారం సా॥)
6.25

సహర్
(సోమవారం ఉ॥)
4.53

**రంజాన్ వేళలు**

## న్యూస్‌రీల్

### శ్రీవారికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీవారి పాదంతో పాటు మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం చేశారు. అలాగే, స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత పల్లకీ సేవ నిర్వహించగా, తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### తత్కాల్ విధానంలో ఫీజు చెల్లింపునకు అవకాశం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షల ఫీజును తత్కాల్ విధానంలో చెల్లించే అవకాశముందని ఖమ్మం డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. సాధారణ ఫీజుతో పాటు పదో తరగతి విద్యార్థులైతే అదనంగా రూ.500, ఇంటర్ విద్యార్థులైతే రూ.వెయ్యి చెల్లించాలని సూచించారు. ఈనెల 18నుంచి 21వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశమున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### మత్స్యకారులకు ముగిసిన నైపుణ్య శిక్షణ



సర్టిఫికెట్లు అందుకుంటున్న మత్స్యకారులు

కూసుమంచి: పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా స్థానంలో 'అక్వా కల్చర్ ఉత్పత్తి – వ్యవస్థలో అధునాతన సాంకేతికత' అంశంపై ఐదు జిల్లాల మత్స్యకారులకు ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. తెలంగాణ పశు వైద్య విద్యాలయం ఆధ్వర్యాన జాతీయ మత్స్య అభివృద్ధి మండలి సహకారంతో ఏర్పాటుచేసిన శిక్షణకు ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, కామారెడ్డి జిల్లాల మత్స్యకారులు పాల్గొనగా ముగింపు సమావేశంలో ఒడిశా రాష్ట్రంలోని స్కూల్ ఆఫ్ ఫిషరీస్ ప్రొఫెసర్, పూర్వ పాలేరు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని తెలంగాణను చేపల ఉత్పత్తిలో మేటిగా మార్చేందుకు మత్స్యకారులు కృషిచేయాలని సూచించారు. పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్‌తో పాటు శాస్త్రవేత్తలు శాంతన్న, రవీందర్ పాల్గొన్నారు.



# కోడ్.. అలర్ట్ !

## వెలువడిన లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్

- రెండు నియోజకవర్గాల పరిధిలో ఉమ్మడి జిల్లా
- ఖమ్మం నామినేషన్లు కలెక్టరేట్‌లో స్వీకరణ
- వచ్చేనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు, మే 13న పోలింగ్
- ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం
- ప్రధాన రాజకీయ పార్టీల్లో సందడి
- చివరిరోజు మంత్రుల సుడిగాలి పర్యటన



విగ్రహానికి ముసుగు వేస్తున్న దృశ్యం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం విడుదల చేయగా కోడ్ అమల్లోకి వచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో ఉంది. ఖమ్మం లోక్‌సభ పరిధిలో ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు, మహబూబాబాద్ పరిధిలోకి ఇల్లెందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాలు వస్తాయి. ఎన్నికల కోడ్ వస్తుందని ముందే ప్రచారం జరగడంతో వారం రోజులుగా రాష్ట్ర మంత్రులు ఉమ్మడి జిల్లాలో రూ.వందల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మరోవైపు నెలరోజులుగా ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం కోడ్ అమల్లోకి రావడంతోనే పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. ఇక షెడ్యూల్ విడుదలతో ప్రధాన రాజకీయ పార్టీల్లో సందడి నెలకొంది.

**పోలింగ్‌కు రెండు నెలలు**

దేశవ్యాప్తంగా ఏడు దశల్లో పోలింగ్ జరగనుండగా, తెలంగాణ, ఏపీల్లో నాలుగో దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. షెడ్యూల్ విడుదలైన శనివారం నుంచి లెక్కిస్తే పోలింగ్‌కు 58 రోజుల సమయం ఉంది. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అలాగే, మే 13న పోలింగ్ నిర్వహించి, జూన్ 4న ఓట్లు లెక్కించనున్నారు. ఖమ్మం పార్లమెంట్ స్థానానికి ఖమ్మం కలెక్టరేట్‌లో, మహబూబాబాద్ స్థానానికి అక్కడి కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఖమ్మం స్థానానికి సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఈవీఎం డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపునకు సిద్ధమవుతున్నారు. ఖమ్మం పార్లమెంట్‌లో 1,455 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా, అదనంగా నాలుగు కేంద్రాల కోసం కలెక్టర్ ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించారు.

**ఖరారు కాని ఖమ్మం అభ్యర్థులు**

రాజకీయ పార్టీల్లో ఎన్నికల సందడి నెలకొనగా.. షెడ్యూల్ వెలువడడంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపిక, గెలుపు వ్యూహాలపై దృష్టి సారించాయి. బీఆర్‌ఎస్ ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో సిట్టింగ్ ఎంపీలైన నామా నాగేశ్వరరావు, మాలోతు కవితను మరోసారి బరిలోకి దింపింది. ఇక కాంగ్రెస్ మానుకోట స్థానానికి కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్‌ను, బీజేపీ మాజీ ఎంపీ సీతారాం నాయక్‌ను అభ్యర్థులుగా ప్రకటించాయి. అయితే, ఖమ్మం స్థానానికి మాత్రం ఆ రెండు పార్టీల అభ్యర్థులు ఎవరో తేలలేదు. దీంతో అటు ఆశావహులు, ఇటు పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. సీపీఎం, సీపీఐ సైతం ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతుండగా, కాంగ్రెస్‌తో కలిసి వెళ్తాయా.. లేక ఒంటరిగా పోటీ చేస్తాయా అన్నది తేలాల్సి ఉంది.

**రూ.వెయ్యి కోట్ల విలువైన పనులకు శ్రీకారం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ మూడు నెలల్లో రూ.వెయ్యి కోట్లపైగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం, మణుగూరులో ఏర్పాటుచేసిన సభల్లో పాల్గొన్నారు. అలాగే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి కొద్ది గంటల ముందు వరకు కూడా మంత్రులు పొంగులేటి, తుమ్మల.. పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

### హోర్డింగ్‌లు.. ఫ్లెక్సీల తొలగింపు

ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల తొలగింపుపై సిబ్బంది దృష్టి సారించారు. శనివారం సాయంత్రం నుంచే ఈ ప్రక్రియ మొదలుకాగా, రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. అలాగే, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎన్నికలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను 1950 టోల్ ఫ్రీ నంబర్‌తో స్వీకరించనున్నారు. షెడ్యూల్ వెలువడగానే కలెక్టర్ పార్లమెంట్ పరిధిలోని అధికారులతో సమావేశమై విధి నిర్వహణపై సూచనలు చేశారు. అలాగే, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏపీకి సరిహద్దున ఉండడంతో అశ్వారావుపేట, మధిర, ఎర్రుపాలెం, బోనకల్, సత్తుపల్లి, ముదిగొండ, నేలకొండపల్లి ప్రాంతాల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు.

### అమల్లోకి ఎన్నికల కోడ్.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్ సీపీ సునీల్‌దత్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యాన ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుండి శనివారం డీజీపీ రవిగుప్తా, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతోనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎన్నికల కోడ్) అమల్లోకి వచ్చిందని తెలిపారు. రానున్న 24 గంటల వ్యవధిలో ప్రభుత్వ కార్యాలయాల్లో, 48 గంటల వ్యవధిలో ప్రభుత్వ ఆస్తుల వద్ద, 72 గంటల్లోగా ప్రైవేట్ స్థలాల్లో నాయకుల హోర్డింగ్‌లు, ఫొటోలు, వాల్‌రైటింగ్స్ తొలగించాలని ఆదేశించారు. జిల్లా నుంచి వీసీలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, ట్రెయినీ ఐపీఎస్ మౌనిక పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమై మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి ఉద్యోగులను నియమించాలని సూచించారు. అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ వినోద్, డీఆర్డీఓ సన్యాసయ్య, సీపీఓ శ్రీనివాస్, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

# దేశ చరిత్రలో నిలిచిన వైఎస్సార్

- ఆయన స్ఫూర్తితో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- బీఆర్‌ఎస్, బీజేపీ డ్రామాలో భాగమే ఎమ్మెల్సీ కవిత అరెస్ట్
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



చెన్నారంలో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో అడిగిన వారికి కాదనకుండా ఇందిరమ్మ ఇళ్లు కట్టించారని.. దేశంలోనే అత్యధిక ఇళ్లు నిర్మించిన సీఎంగా చరిత్రలో నిలిచిపోయి పేదల కళ్లలో ఆనందం నింపారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచి, జీళ్లచెరువుల్లో సీసీ రహదారుల పనులకు శంకుస్థాపన చేశాక మంత్రి మాట్లాడారు. ఇప్పుడు గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న తాను వైఎస్సార్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతీ పేద వాడికి ఇల్లు నిర్మించి ఇస్తానని తెలిపారు. అర్హులకు త్వరలో తెల్లరేషన్ కార్డులు కూడా మంజూరవుతాయని చెప్పారు. కాగా, బీఆర్‌ఎస్, బీజేపీ డ్రామాలో భాగంగానే కవితను అరెస్ట్ చేసినట్లు అర్థమవుతోందని మంత్రి వ్యాఖ్యానించారు. అయినా ఆ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రభుత్వానికి వంద రోజులు పూర్తయిన సందర్భంగా జీళ్లచెరువులో మంత్రి కేక్ కట్ చేశారు.

■ **నేలకొండపల్లి:** చెప్పిన ప్రతీ మాట... ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుంటుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. నేలకొండపల్లి మండలం చెన్నారం, చెరువుమాదారంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయగా, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అలాగే, చెరువుమాధారంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన బైరవునిపల్లిలో కాటమయ్య ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

■ **ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలం కైకొండాయిగూడెంలో సీసీ రహదారుల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమాల్లో ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్‌నాయక్, వజ్జా రమ్య, నాయకులు రాయల నాగేశ్వరరావు, స్వర్ణకుమారి, మాదాసు ఉపేందర్, చెన్నా మోహన్, హఫీజుద్దీన్, కొరివి వెంకటరత్నం, జూకూరి గోపాలరావు, జొన్నలగడ్డ రవి, బారి వీరభద్రం, అంజయ్య, వినోద, సూర్యనారాయణరెడ్డి, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, కట్టెకోల సుధాకర్, యడవల్లి హుస్సేన్‌గౌడ్, మంకెన వెంకటేశ్వరరావు, సుల్తాన్, వీరబాబు, మానుకొండ వెంకటేశ్వరరావు, కడియాల నరేష్, మద్ది మల్లారెడ్డి, కళ్లెం వెంకటరెడ్డి, బండి జగదీష్, మద్ది వీరారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ముందుగానే కేంద్రాలకు చేరుకోండి : డీఈఓ

ఖమ్మంసహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు ముందు రోజే కేంద్రాలను సరిచూసుకుంటే మంచిదని సూచించారు. అలాగే, పరీక్ష రోజు కేంద్రాలకు హాల్‌టికెట్లతో నిర్ణీత సమయానికి కంటే ముందుగా చేరుకోవాలని తెలిపారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని, అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం వ్యవహరిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు సమాచారం ఇచ్చేందుకు డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 83318 51510 నంబర్‌లో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

# రైతును పూజిస్తే మంచిది..

- రూ.100 కోట్లతో ఖమ్మం మార్కెట్ అభివృద్ధి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను రూ.100 కోట్ల నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మార్కెట్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో కార్మికులకు ఆయన యూనిఫాం అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అన్నతదాతను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. రైతుకు ఎన్ని కష్టాలు వచ్చినా, భార్య మెడలో పుస్తెలు అమ్మి అయినా భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తాడని.. అందుకే దేవుడిని పూజించే కంటే రైతన్నను పూజిస్తే మంచిదని పేర్కొన్నారు. అంతేకాక హమాలీలు మొదలు ప్రధాని వరకు రైతును దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని కోరారు. కాగా, రాష్ట్రంలోనే ఖమ్మం మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఖమ్మం నగరంలో ఉన్న మార్కెట్‌తో ప్రజలు, మార్కెట్ వర్గాలు ఇబ్బంది పడుతున్నందున, అందరికీ ప్రయోజనం కలిగేలా నిర్మాణం ఉండాలని అధికారులకు సూచించారు. గత పాలకులు ముందు చూపు లేకుండా నాగార్జునసాగర్, శ్రీశైలం నీటిని వినియోగించడంతో ఇప్పుడు సమస్య తలెత్తుతోందని... ఖమ్మం నగరానికి ప్రధానవనరులైన పాలేరు, దానవాయిగూడెంల్లో నీరు లేక ఇబ్బందులు వస్తున్నాయని తుమ్మల తెలిపారు. అయితే, తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వివరించారు. అనంతరం మార్కెట్‌లో పనిచేసే 2,760 మంది హమాలీలు, స్వీపర్లు, దడువాయిలు, ట్రాలీ వర్కర్లు తదితరులకు రూ.55 లక్షల విలువైన యూనిఫాం పంపిణీ చేయగా, గత ఏడాది మార్కెట్‌లో అగ్ని ప్రమాదంతో పత్తి కాలిపోగా వ్యాపారులకు ఇన్సూరెన్స్ కంపెనీ ఇచ్చిన పరిహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఈ.మల్లేశం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌తో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, మానుకొండ రాధాకిషోర్, నల్లమల వెంకటేశ్వరరావు, నల్లమల ఆనంద్, జొన్నలగడ్డ రవికుమార్, నల్లమోతు లక్ష్మయ్య, దిరిశాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఫారెస్ట్ క్వార్టర్స్ ప్రారంభం**

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం పాత బస్టాండ్ సమీపాన రూ.28లక్షల వ్యయంతో నిర్మించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల క్వార్టర్స్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. జిల్లా అటవీ శాఖాధికారి సిదార్థ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీఓ ప్రకాష్‌రావు, ఎఫ్ఆర్ఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# 3,97,227 కేసుల పరిష్కారం

- విజయవంతమైన జాతీయ లోక్ అదాలత్
- మోటారు ప్రమాద కేసుల్లో రూ.1.02కోట్ల పరిహారం



కేసులను పరిష్కరిస్తున్న జడ్జి రాంప్రసాదరావు

ఖమ్మం లీగల్: జాతీయ లోక్‌అదాలత్ జిల్లాలో విజయవంతమైంది. జిల్లా ప్రధాన నాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ ఆధ్వర్యాన శనివారం జిల్లా వాప్తంగా కోర్టుల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 3,97,227 కేసులను పరిష్కరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా గత నెలలోనే లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటుచేయగా ఈనెల 1నుంచి ముందస్తుగా కేసుల పరిష్కారం ప్రారంభమైంది. ఈ మేరకు శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ జావేద్ పాషా సివిల్ కేసులను పరిష్కరించడమే కాక బెంచ్‌లను సమన్వయపరిచారు.

**కేసుల పరిష్కారం ఇలా...**

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా మొదటి అదనపు జిల్లా నాయమూర్తి కె.ఉమాదేవి 541 విద్యుత్ చౌర్యం కేసులను పరిష్కరించారు, మూడో అదనపు జిల్లా జడ్జి డి.రాంప్రసాదరావు 55మోటారు వాహన ప్రమాద కేసులను పరిష్కరించగా బాధితులకు రూ.1.02కోట్ల పరిహారం ఇప్పించారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.గోపిక నాగశ్రావ్య సైబర్ క్రైం, బ్యాంకు కేసులతో పాటు మొత్తం 70 కేసులను పరిష్కరించారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.దీప అధ్యక్షత వహించిన బెంచ్‌లో 246 కేసులు పరిష్కారమయ్యాయి. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వై.బిందుప్రియ 1,858 కేసులను, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.మాధవి 312, ఎక్సైజ్ కోర్టు నాయమూర్తి ఆర్.శాంతిలత 128, మొబైల్ మెజిస్ట్రేట్ బి.రజని 312, ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ సయద్ సలీం 392ట్రాఫిక్ కేసులతో పాటు 510 కేసులను పరిష్కరించారు. ఇక మధిర, సత్తుపల్లి కోర్టుల్లోనూ పెద్దసంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయి. న్యాయవాదులు మాదిరాజు లక్ష్మీనారాయణ, ఎ.విజయరాఘవ, జి.అమర్‌నాథ్, వి.అరుణ, ఆర్.వెంకట్, జి.ప్రవీణ్ కుమార్, కే.వీవీ.వీ.లక్ష్మి, పి.ఇందిర, ఎస్.జనార్దన్ లోక్ అదాలత్ సభ్యులుగా వ్యవహరించారు.

# నామినేటెడ్ బొనాంజా



ముప్వా విజయ్‌బాబు



రాయల నాగేశ్వరరావు



పొదెం వీరయ్య

### ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి రాష్ట్ర స్థాయి పదవులు?

- విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా 'మువ్వా'
- గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా రాయల
- అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పొదెం
- నేతలకు సమాచారం.. ఉత్తర్వులపై ఉత్కంఠ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: నామినేటెడ్ పదవుల పంపకం మొదలైంది. ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీలోని పలువురు ముఖ్యనేతలు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూస్తుండగా.. పార్లమెంట్ ఎన్నికల ముందే భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఇంతలోనే ఆశావహుల ఎదురుచూపులు ఫలించేలా లోక్‌సభ ఎన్నికల వేళ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీకి కదిలినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు మూడు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టులు దక్కనున్నాయని సమాచారం. రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పొదెం వీరయ్యను నియమించినట్లు తెలిసింది. ఆయా నేతలకు సమాచారం ఇవ్వగా, అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సిఉంది.

**టికెట్ ఆశించి.. నామినేటెడ్‌కు..**

టీపీసీసీ నేత రాయల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి పాలేరు టికెట్ ఆశిస్తూ వచ్చారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అనుచరుడిగా ఉన్న ఆయనకు పాలేరు టికెట్ ఖాయమని జోరుగా ప్రచారం సాగింది. అయితే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో పాలేరు స్థానాన్ని ఆయనకు కేటాయించారు. అంతకుముందు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాయల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి.. ఆతర్వాత పాలేరు టికెట్ కూడా దక్కక రాయల అసంతృప్తితో ఉన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర స్థాయి పదవి ఇస్తామంటూ కాంగ్రెస్ నేతలు బుజ్జగించడంతో ఆయన పార్టీలోనే కొనసాగుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేశారు. అనుకున్నట్లుగానే కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రాష్ట్ర స్థాయి పదవి రాయలకు దక్కనుందనే చర్చ సాగింది. ఈ మేరకు గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం ఆయనను నియమించాలని నిర్ణయించినట్లు తెలిసింది. రాయల స్వస్థలం ముదిగొండ మండలం వెంకటాపురం కాగా, ప్రస్తుతం ఖమ్మంలో నివాసముంటున్నారు.

**డీసీసీబీ నుంచి పయనం..**

పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామానికి చెందిన మువ్వా విజయబాబు రాజకీయ ప్రస్థానం టీడీపీతో మొదలైంది. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో కొంతకాలం కొనసాగగా.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెనుబల్లి సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న మువ్వా 2013 నుంచి 2018 వరకు డీసీసీబీ చైర్మన్‌గా పని చేశారు. కాంగ్రెస్ పార్టీలో మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగానూ ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరాక ఖమ్మం అసెంబ్లీ స్థానం టికెట్ ఆశించిన వారి జాబితాలో మువ్వా పేరు కూడా ఉంది. పార్టీ అధికారంలోకి రావడంతో తమ నేతకు నామినేటెడ్ పదవి ఖాయమని ఆయన అనుచరులు ధీమా వ్యక్తం చేస్తున్నట్లుగానే విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవిలో నియమించినట్లు సమాచారం.

**ములుగు నుంచి భద్రాద్రికి..**

ములుగు జిల్లా మంగపేట మండలం తొండ్యాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన పొదెం వీరయ్య ములుగు నియోజకవర్గం నుంచి 1999, 2004 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009, 2014 ఎన్నికల్లో ఓటమి పాలైన వీరయ్య.. 2018లో భద్రాచలం నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. తిరిగి గత ఎన్నికల్లో పరాజయం పొందిన వీరయ్య ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇప్పుడు ఆయన అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైనట్లు తెలిసింది.

## క్లుప్తంగా

### మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి రెండు సీట్లు మాదిగలకు కేటాయించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా శనివారం ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆయన సన్మానించి మాట్లాడారు. మాదిగ, మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భద్రయ్య, రాజేశ్, వెంకన్నబాబు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి పోటీల్లో సత్తా


రూప

బోనకల్: బిహార్ రాష్ట్రం పాట్నాలో ఇటీవల జరిగిన జూనియర్ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో బోనకల్‌కు చెందిన కె.రూప ప్రతిభ చాటింది. పోటీల్లో ఆమె తృతీయ స్థానంలో నిలిచి బహుమతి అందుకుంది. బోనకల్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రూపను ప్రిన్సిపాల్ పార్వతి, కోచ్ అమిరేశి లింగయ్య, బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొందు శ్రీనివాసరావు అభినందించారు.

### డీసీసీబీ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని లేఖ

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం డీసీసీబీ నూతన చైర్మన్ ఎన్నికకు తీర్మానం చేయాలని బ్యాంకు డైరెక్టర్లు ప్రస్తుత చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుకు లేఖ అందజేశారు. బ్యాంకు పాలకవర్గ సమావేశం శుక్రవారం జరగగా, 15 మంది డైరెక్టర్లు నూతన చైర్మన్ ఎన్నికకు తీర్మానించాలని లేఖ ఇచ్చారు. 2020లో డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన కూరాకుల నాగభూషణం.. వీవీ పాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా అవిశ్వాస తీర్మానంతో రెండు పదవులు కోల్పోయారు. దీంతో వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత ఆయన బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అయినప్పటికీ నూతన చైర్మన్ ఎన్నికకు తీర్మానించాలని డైరెక్టర్లు లేఖ ఇవ్వగా, ఆయన అంగీకరించలేదు. కాగా, పాలకవర్గం తీర్మానం చేసి ప్రతిని జిల్లా సహకార అధికారికి ఇస్తేనే చైర్మన్ ఎన్నికకు అవకాశముంటుంది. కానీ, తీర్మానానికి ప్రస్తుత చైర్మన్ అంగీకరించకపోగా, శనివారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యాన చైర్మన్‌తో పాటు మరో ముగ్గురు డైరెక్టర్ల ఎన్నిక కూడా ఇప్పట్లో జరిగే అవకాశం కనిపించడం లేదు.

### నేటి నుంచి క్రికెట్, వాలీబాల్ పోటీలు

రఘునాథపాలెం: భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు జాటోతు ప్రేమ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా పోటీల కరపత్రాలను శనివారం ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. పోటీలను జయ విలాసిని అధినేత డాక్టర్ కుంచపు రాంబాబు ప్రారంభిస్తారని, భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 23న బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు జరపర దేవ్లా, ధరావత్ లక్ష్మణ్, కేలోతు పాపారావు, కేలోతు లక్ష్మణ్, ఇస్లావత్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలకు టీవీ


సీపీ చేతుల మీదుగా టీవీ అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంక్రైం: విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం సాయంగా బోధించేందుకు ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ బాధ్యులు శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాలకు ఆండ్రాయిడ్ టీవీ అందజేశారు. ఈ టీవీని సీపీ సునీల్‌దత్ చేతుల మీదుగా శనివారం పాఠశాలకు అందజేయగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు కామరాజు, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### జ్వరంతో వ్యక్తి మృతి

**వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని ఆస్పత్రిపై దాడి**

ఖమ్మంక్రైం: జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి వ్యక్తి మృతి చెందగా.. వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ ఖమ్మంలోని వైరా రోడ్డులో ఉన్న ఆస్పత్రిపై మృతుడి బంధువులు దాడి చేశారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడికి చెందిన కంటిపూడి నర్సింహారావు(47)కు జ్వరం రాగా ఇటీవల ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వారం తర్వాత ఇంటికి తీసుకెళ్లగా మళ్లీ జ్వరం రావడంతో వైద్యుడిని సంప్రదిస్తే ఖమ్మంలోని ఇంకో ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. అక్కడకు వెళ్లగా వైద్యుడు రాకపోగా ఫోన్ చేసినా స్పందించలేదు. ఇంతలోనే నర్సింహారావు మృతి చెందగా, సదరు వైద్యుడి ఆస్పత్రిపై ఆయన బంధువులు దాడి చేశారు. పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం దాడిపై ఐఎంఏ బాధ్యులు, చికిత్స లోపంపై నర్సింహారావు బంధువులు ఫిర్యాదు చేయగా ఇరువర్గాలపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, వైద్యులకు రక్షణ కల్పించాలని వైద్యులు కిషోర్‌బాబు, వెంకటేశ్వర్లు, గురునాథరావు, కిషన్‌రావు, నారాయణరావు, పాపారావు నగర ఏసీపీ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు.

# హలీం ఆగయా!


నోరూరించే హలీం రుచిని ఆస్వాదిస్తూ..

రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. రోజంతా ఉపవాసం ఉండే ముస్లింలు సాయంత్రం దీక్ష విరమించాక బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం ఆనవాయితీ. ఇందులో హలీం, హరీస్ ప్రముఖంగా నిలుస్తుండగా వీటిని అన్నివర్గాల ప్రజలూ ఇష్టంగా స్వీకరిస్తారు. అందుకే రంజాన్ మాసంలో హలీం ఘుమఘుమలు వెదజల్లుతుంటాయి. జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో హలీం, హరీస్ సెంటర్లే కాక రుమాల్ రోటీ, చికెన్ కర్రీ, ఖద్దూ కా కీర్, దబుల్‌కా మిఠా వంటకాలతో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ మేరకు సాయంత్రం కాగానే హలీం ప్రియులు ఆయా సెంటర్ల వద్ద బారులు దీరుతున్నారు. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్


హలీం వడ్డిస్తూ...


హలీం విక్రయ కేంద్రం


రుమాల్ రోటీ చేస్తున్న మాస్టర్

## విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దాలి..


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన రవిమారుత్, పార్వతీరెడ్డి తదితరులు

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ఖమ్మంరూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూనే అన్నిరంగాల్లో తీర్చిదిద్దాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని కరుణగిరిలో హార్వెస్ట్ స్ప్రింగ్‌లీఫ్ పాఠశాల వార్షికోత్సవం శనివారం జరగగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెద్దపెద్ద విద్యాసంస్థలన్నీ నగరంలోనే ఉండగా.. దూరప్రాంతాల విద్యార్థులు అవస్థ పడకుండా రూరల్ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి పాఠశాలల ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, కవి మువ్వా శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎంపీ రాజన్, ప్రీతి, చందన తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వాయర్ ఆధునికీకరణకు రెడీ..

- రెండో దశ పనులకు రూ.42.10 కోట్లు
- కాంక్రీట్ లైనింగ్ పనులతో పెరగనున్న ఆయకట్టు


ఆధునికీకరించనున్న రిజర్వాయర్ కాల్వ

వైరా: నైజాం కాలంలో నిర్మించిన వైరా రిజర్వాయర్‌కు వందేళ్ల చరిత్ర ఉండగా.. సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తూనే మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తోంది. పదహారేళ్ల కిందట అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.55 కోట్ల నిధులు మంజూరు చేయగా, కుడి, ఎడమ కాల్వల పరిధిలో 15 కిలోమీటర్ల మేర గైడ్ వాల్స్, అదనపు అలుగు నిర్మాణం చేశారు. అప్పటి నుంచి మిగిలిన పనుల కోసం నిధులు మంజూరు కాకపోగా, గత ప్రభుత్వ హయాంలో బడ్జెట్‌లో ప్రకటించినా నిధులు మాత్రం విడుదల కాలేదు.

**మళ్లీ ఇప్పుడు నిధులు**

రిజర్వాయర్ ఆధునికీకరణ రెండో దశ పనులకు ఏళ్లుగా ఎదురుచూస్తుండగా ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా రూ.55 కోట్లు నిధులు విడుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధుల్లో రూ.42.10 కోట్లతో కుడి కాల్వలో 7.8 కి.మీ. నుంచి 20.5 కి.మీ. వరకు, ఎడమ కాల్వలో 9.5 కి.మీ. నుంచి 13.5 కి.మీ. వరకు సిమెంట్ లైనింగ్, కాంక్రీట్ పనులు చేపడతారు.

**పెరగనున్న ఆయకట్టు**

రిజర్వాయర్ అభివృద్ధి పనుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తుండగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కదలిక వచ్చింది. ఆధునికీకరణ పనులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తీసుకెళ్లగా నిధులు విడుదల చేశారు. కాగా, రిజర్వాయర్ పరిధిలో అధికారికంగా 17,390 ఎకరాలు ఆయకట్టు ఉండగా.. వైరా, బోనకల్, తల్లాడ మండలాల పరిధిలో ఆధునికీకరణ పనులు పూర్తయితే మరో 30 వేల ఎకరాలు సాగులోకి రానున్నాయి. గతంలో చివరి ఆయకట్టు భూములకు నీరు అందాలంటే 12 గంటలు పడుతుండగా.. పనులు పూర్తయితే ఆరు గంటల్లోనే నీరు చేరుతుంది.

### గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

నేలకొండపల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదమున్నందున రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని గాలికుంటు టీకాల పర్యవేక్షణాధికారి డాక్టర్ రమణి సూచించారు. మండలంలోని రాజేశ్వరపురంలో వ్యాక్సినేషన్‌ను శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని, తద్వారా నష్టం జరగకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య, మండల పశువైద్యాధికారి సంజయ్‌రెడ్డితో పాటు చంద్రమ్మ, దండా రంగయ్య, సుభాష్, గోవింద్, వజ్జా శ్రీనివాస్, నరేశ్, పాండు, నాగరాజు, తాజ్‌పాషా పాల్గొన్నారు.

### నలుగురిపై కేసు నమోదు

కల్లూరు: కల్లూరులో వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై శనివారం దాడి చేసిన పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. పట్టణంలో ఓ ఇంట్లో పెనుబల్లి మండలానికి చెందిన వ్యక్తి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. శనివారం అక్కడకు సుజాతనగర్‌కు చెందిన ఇద్దరు రాగా తనిఖీ చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. అలాగే, గతంలో పట్టుబడిన వారికి మళ్లీ ఇల్లు అద్దెకు ఇవ్వడంపై యజమానిపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందిన ఘటన ఖమ్మం రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సదరు వ్యక్తి ఢక్కా వద్దా పట్టాలు దాటుతుండగా విజయవాడ వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589, 94932 18856 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### రోడ్డుప్రమాదంలో యువకుడు..


ఉపేందర్ (ఫైల్)

కొణిజర్ల: ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. కొణిజర్ల – మల్లుపల్లి గ్రామాల మధ్య శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మల్లుపల్లికి చెందిన ఆలకుంట ఉపేందర్ (20) బైక్‌పై కొణిజర్ల వెళ్తుండగా, చింతల చెర్వు మూలవద్ద కొణిజర్ల నుంచి మల్లుపల్లి వెళ్తున్న ఆటో పరస్పరం ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన ఉపేందర్‌ను స్థానికులు కొణిజర్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆటోలో ఉన్న మాలోత్ మోతి, శాంతికి గాయాలయ్యాయి. ఉపేందర్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంకరరావు తెలిపారు. మృతుడు కూలీ పని చేస్తుంటాడు.

## అప్పుల బాధతో నేత కార్మికుడు ఆత్మహత్య


వెంకన్న (ఫైల్)

తిరుమలాయపాలెం: అప్పులు తీర్చలేని మనోవేదనతో నేత కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని తెట్టెలపాడుకు చెందిన పెంటి వెంకన్న (47) నేత పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్న ఆయన మానసిక ఆందోళనకు గురై శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత గ్రామశివారు ఎస్సారెస్పీ కాల్వ పక్కన ఉరి వేసుకోగా, శనివారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు ఆయన భార్యాపిల్లలకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### పాఠశాలల్లో ‘అమ్మ ఆదర్శ కమిటీలు’ వేయండి

ఖమ్మంసహకారనగర్: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసి కనీస మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలతో సమావేశమైన కలెక్టర్ మహిళాశక్తి కార్యక్రమ అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తున్నామని, ఇందుకోసం ప్రతీ పాఠశాలలో రెండేళ్ల పాటు కొనసాగేలా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. కమిటీకి మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలిగా, హెచ్‌ఎం మెంబర్ కన్వీనర్‌గా ఉంటారని, గ్రామంలో రెండు, మూడు సంఘాలు ఉంటే పాఠశాలకు సమీపంలోని సంఘానికి తొలుత అవకాశం ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత విద్యార్థుల తల్లులను సభ్యులుగా ఎంపిక చేయాల్సి ఉంటుందని తెలిపారు. కమిటీ పేరిట బ్యాంక్ ఖాతా తెరిచి, పాఠశాలలో కావాల్సిన వసతులను వచ్చే విద్యాసంవత్సరానికల్లా సమకూర్చుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, డీఈఓ సోమశేఖరశర్మ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్‌ను కలిసిన మైనింగ్ ఏడీ**

ఖమ్మంఅర్బన్: మైనింగ్ ఏడీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సాయినాథ్ కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలిశారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన ఏడీ పుష్పగుచ్ఛం అందజేశారు.


మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

### రైతులకు సహకరించాలి..

రఘునాథపాలెం: ఎరువులు, పురుగు మందుల డీలర్లు రైతులకు సాగులో జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎం.విజయనిర్మల సూచించారు. మండలంలోని వీవీ పాలెం రైతువేదికలో శనివారం వివిధ మండలాలకు చెందిన ఎరువులు, పురుగుమందుల వ్యాపారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రైతులతో మమేకమై చీడపీడల నివారణ, రసాయనిక ఎరువులపై రైతులకు జాగ్రత్తలు చెప్పాలని పేర్కొన్నారు. సమావేశంలో వేణుమనోహర్, రమణ, ఆంజనేయస్వామి, శాస్త్రవేత్తలు రవికుమార్, సరిత, భరత్ తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక లారీలు సీజ్

కామేపల్లి: ఓవర్ లోడ్‌తో వెళ్తున్న రెండు ఇసుక లారీలను కామేపల్లి పోలీసులు శనివారం సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

### రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తల్లాడ: మండలంలోని రేజర్ల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. తల్లాడ జెడ్పీహెచ్‌ఎస్ అటెండర్ షేక్ లాల్ పాఠశాల నుంచి మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా వైరా మండలం గాంధీనగర్‌కు చెందిన సీహెచ్ గోపి మోటార్ సైకిల్‌పై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ కొండల్‌రావు తెలిపారు.

### కబేళాకు తీసుకెళ్తున్న గోవుల స్వాధీనం

ఖమ్మంఅర్బన్: కబేళాకు అక్రమంగా తరలుతున్న 60 గోవులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన తనిఖీల్లో వీటిని గుర్తించగా, ఖానాపురం టేకులపల్లిలోని శ్రీ వెంకటేశ్వర గోశాలలో సంరక్షణ నిమిత్తం తరలించారు. అయితే, వాహనాల్లో కుక్కి మరీ గోవులను తీసుకెళ్తుండగా కొన్నింటికి తీవ్ర గాయాలయ్యాయని గోశాల నిర్వాహకులు తెలిపారు.

## పోరాటాలు, త్యాగాలతోనే హక్కుల సాధన


ఈయూ రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న కూనంనేని, పక్కన నాయకులు

- నిబద్ధత లేని కార్మిక సంఘాలది ద్రోహం
- కార్మికులను విస్మరిస్తే కాంగ్రెస్‌కే నష్టం
- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర మహాసభల్లో కూనంనేని

ఖమ్మంమయూరిసెంటర్: పోరాటాలు, త్యాగాలతోనే కార్మికులకు హక్కులు సాధించుకున్నామని.. అదే కోవలో హక్కులు, సంక్షేమ పథకాల కోసం పోరాడక తప్పదని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఏఐటీయూసీ ఎన్నటికీ కార్మిక పక్షాన్నే నిలుస్తుందని చెప్పారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ మూడో రాష్ట్ర మహాసభలు ఖమ్మంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. తొలుత ఎంప్లాయీస్ సీనియర్ నాయకుడు పద్మాకర్ యూనియన్ పతాకాన్ని, అమరుల స్తూపాన్ని తిమ్మినేని రామారావు ఆవిష్కరించారు. అనంతరం ఎస్.బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ.. ఆర్టీసీలో 1956లో ఉద్భవించిన మొట్టమొదటి సంఘం ఎంప్లాయీస్ యూనియన్ ద్వారా ఆర్టీసీ కార్మికులకు అనేక హక్కులు లభించాయని తెలిపారు. గుర్తింపు సంఘంగానూ పలుమార్లు గెలిచిందని చెప్పారు. కొందరు నాయకులు పదవుల కోసం కార్మికుల త్యాగాలను పణంగా పెట్టి విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలుపుతున్నా అంతిమంగా ఎర్ర జెండానే కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. నిబద్ధత లేని కార్మిక సంఘాలతో ఎప్పుడైనా ప్రమాదమేనని గుర్తించాలని సూచించారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ కార్మిక వ్యతిరేక పార్టీలేనని కాంగ్రెస్ కూడా తన వైఖరిని మార్చుకుంటే మంచిదని తెలిపారు. ఇటీవల కార్మిక సంఘాలతో నిర్వహించిన సమావేశానికి ఎంప్లాయీస్ యూనియన్‌ను ఆహ్వానించకపోవడం గర్హనీయమన్నారు. ఇకనైనా మూడు నెలల్లో 22 కోట్ల మంది మహిళలను గమ్యాలకు చేర్చిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఫిట్‌మెంట్ పెంచి, పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని కూనంనేని కోరారు. ఆర్టీసీ కార్మికులుగా ఇదే చివరి మహాసభ కావొచ్చని, ప్రభుత్వ ఉద్యోగులుగా మారినా వామపక్ష భావజాలాన్ని నిలుపుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సభలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, ఈయూ రాష్ట్ర కార్యదర్శి ఇ.వెంకన్న, ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్, సీపీఐ, ఈయూ నాయకులు మీఎస్ బోస్, పోటు ప్రసాద్, ఎస్కే సాబీర్‌పాషా, ఇ.వెంకన్న, నర్సింహన్, రామాంజనేయులు, దామోదర్, నర్సయ్య, కె.భాస్కర్‌రావు, పాటి అప్పారావు, పిల్లి రమేశ్ పాల్గొనగా, రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి 250 మంది ప్రతినిధులు హాజరయ్యారు.